క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో రామాపురం విద్యార్థి ప్రతిభ


సాయిశంతన్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

బత్తలపల్లి: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) – 2024 ఫలితాల్లో బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన కప్పల సాయిశంతన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కప్పల రామమూర్తి, శివకుమారి దంపతుల కుమారుడు సాయిశంతన్ నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 653 మార్కులు సాధించి 26,767వ ర్యాంకు సాధించాడు. సాయిశంతన్ విజయవాడలోని గోసాలైట్స్ మెడికల్ అకాడమీ కళాశాలలో ఇంటర్ చదివాడు. అత్యుత్తమ ర్యాంకు సాధించిన సాయిశంతన్‌కు తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

చిన్నారులకు టీకాలు


తాడిమర్రిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, కునుకుంట్ల, ఎం.అగ్రహారం, దాడితోట, చిల్లవారిపల్లి, నార్సింపల్లి తదితర గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లలో బుధవారం చిన్నారులకు పెంటా, హెపటైటిస్– బీ, జేసీబీ తదితర టీకాలను వేశారు. అనంతరం చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను బాలింతలకు వివరించారు. చిన్నారులకు ఆరు నెలల వరకు అమ్మపాలు మాత్రమే తాపాలన్నారు. ఆరు నెలల తర్వాత ఉడికించిన పప్పు, అన్నం తినిపించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, సుగుణ, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో 8వ తరగతి చదువుతున్న చైతన్య, నిత్యశ్రీ, లేఖన, శరణ్యసాయి, యశస్విని, రేవంత్ సాయి ఉన్నారు. వీరిని అభినందించినట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు.

ఉపకార వేతనానికి ఎంపిక

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి చరణ్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం శ్రీధర్ తెలిపారు. ప్రతి ఏడాది రూ.12 వేలు ఉపకార వేతనం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి చరణ్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

22 వేల పాఠ్యపుస్తకాల సరఫరా

కనగానపల్లి: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ అరుణమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి సుమారు 26 వేలు పుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటి వరకు 22 వేలకు పైగా పుస్తకాలు కార్యాలయానికి వచ్చినట్లు వెల్లడించారు. వీటితో పాటు విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లు కూడా ఒక్కొక్కటి కార్యాలయానికి చేరుతున్నట్లు పేర్కొన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కాగానే వీటిని పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందజేస్తామన్నారు.

అందరికీ అండగా ఉంటాం

గుడిబండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తెలియజేశారు. బుధవారం ఆయన గుడిబండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో చమటోడ్చి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల్లో దురదృష్టవశాత్తూ వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని, అయితే ఎవరూ అధైర్యపడవద్దన్నారు. మళ్లీ నూతన ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీని అధికారం తెచ్చుకొనే దిశగా అడుగులు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వాకింగ్



- మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం
- గుండె జబ్బులతో పాటు పలు రకాల వ్యాధులకు చెక్ పెట్టొచ్చంటున్న వైద్యులు

అధిక బరువుతో చిక్కులు

ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పులు కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధులు బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు, చాట్స్ వంటి జంక్‌ఫుడ్స్‌ను అధికంగా తీసుకుంటుండటం అధిక బరువుకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. దీంతో బరువు తగ్గేందుకు అధిక శాతం మంది వాకింగ్ చేస్తున్నారు.

గుడిబండ: ప్రస్తుత ఆధునిక యుగంలో జీవన శైలి వ్యాధులతో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నారు. ఇందులో భాగంగానే వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వ్యాయామంపై దృష్టిసారిస్తున్నారు. మరీ ముఖ్యంగా పల్లెల నుంచి పట్టణాల దాకా వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరించుకుంటున్నారు.

వ్యాయామంతో మానసికోల్లాసం

రోజుకు గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన సామర్థ్యం కూడా పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ఆరోగ్యాభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే జిమ్‌లకు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. వృద్ధులు, యువత సైతం పాఠశాల మైదానాలు, తాము నివాసం ఉంటున్న ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. గతంలో పోలిస్తే వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు.


గుడిబండ మండల కేంద్రంలో వాకింగ్ చేస్తున్న మహిళలు

నడకతో ఆరోగ్యం

ప్రతిరోజూ నడకతో జీవన శైలి వ్యాధులైన బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండెజబ్బులు, చెడు కొలెస్ట్రాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చంటున్నారు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత, మంచి ఆలోచనా శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు.

కరోనా తర్వాత....

కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజలలో అవగాహన స్థాయి పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చక్కని ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ పెడుతున్నారని అంటున్నారు. శారీరక శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం కూడా ఎంతో కృషి చేస్తోంది. వివిధ రకాల ఆటలపోటీలతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది.

శరీరం చలాకీగా ఉంటుంది



గత ఐదేళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం సమయంలో 40 నిమిషాల పాటు నడుస్తున్నాను. దీని వల్ల నాకు ఇప్పుడు బలహీనత అంటూ తెలియడంలేదు. ఆరోగ్యంగా ఉంటున్నా శరీరం చలాకీగా ఉంటోంది.
– భోజరాజు, ఫకారం, గుడిబండ మండలం

మంచి ఆరోగ్యం ఖాయం



క్రమం తప్పకుండా గత ఏడేళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం తప్పకుండా కుటుంబ సభ్యులతో కలిసి వాకింగ్ చేస్తున్నాను. ప్రస్తుతానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. అందరూ నడకను అలవాటు చేసుకుంటే మేలు.
– సతీష్, దేవరహట్టి, గుడిబండ మండలం

వాకింగ్‌తో రోగాలకు చెక్



రోజుకు గంటన్నర నడకతో మంచి ఆరోగ్యంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుంది. ప్రతిరోజూ నడవడం ద్వారా ఎన్నో రోగాలకు చెక్ పెట్టొచ్చు. మరీముఖ్యంగా బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. వైద్యులు కూడా వాకింగ్ తప్పనిసరని చెబుతున్న సంగతి అందరికీ తెలిసిందే. – అజారుద్దీన్, పీఈటీ, గుడిబండ

విద్యార్థికి విమానయానం


విమానంలో ప్రయాణిస్తున్న విద్యార్థి సుశాంత్‌రెడ్డి

తలుపుల: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రోత్సాహకంగా ఓ ఉపాధ్యాయుడు విమానయాన భాగ్యం కల్పించారు. తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎద్దుల సుశాంత్‌రెడ్డి 2023–24 విద్యాసంవత్సరానికి గాను పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించాడు. మండలస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఈ విద్యార్థికి ఉపాధ్యాయుడు టి.ప్రభాకర్ తన సొంత ఖర్చులతో బుధవారం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమాన ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. తొలిసారి విమానంలో ప్రయాణించడం ఆనందంగా ఉందని.. భవిష్యత్తులోనూ మరిన్ని మంచి మార్కులు సాధించి ఉన్నతస్థానానికి చేరుకుంటానని సుశాంత్‌రెడ్డి తెలిపారు.

చైతన్య పాఠశాలలో పుస్తకాల గది సీజ్

కదిరి అర్బన్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చైతన్య పాఠశాల నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు బుధవారం ఆందోళన నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ పుస్తకాలు విక్రయిస్తున్నారని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అనంతరం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈఓ చెన్నకృష్ణ పాఠశాలను తనిఖీ చేసి.. పుస్తకాల గదిని సీజ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మల్లయ్యగారిపల్లిలో పండ్ల మొక్కలు నాటుతున్న దృశ్యం

కదిరి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రెడ్స్ అధ్యక్షురాలు భానూజా పేర్కొన్నారు. బుధవారం మల్లయ్యగారిపల్లి రైతు సిద్దారెడ్డి పొలంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అధ్యక్షురాలు భానూజా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు తమ పొలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. పచ్చదనం తగ్గి కాలుష్యం పెరిగి భూమిలో వేడి పెరగడంతో వర్షాలు కురవడం లేదన్నారు. పండ్ల మొక్కల పెంపకంతో రైతులకు ఆదాయంతో పాటు పర్యావరణం పెంపొందింప చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజునే వసూలు చేయాలి


శ్రీచైతన్య పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను పాఠశాలలో నోటీస్ బోర్డులో ప్రదర్శించడంతో పాటు దాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తుగా అడ్మిషన్లకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఏమాత్రం పాటించకుండా వాళ్లకు ఇష్టం వచ్చినట్టు లక్షల రూపంలో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే అనుమతులు లేకుండా నడుపుతున్న బ్రాంచులను సీజ్ చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు విద్యాసంస్థల పేర్లతో ముద్రించిన పుస్తకాలను రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు విద్యాసంస్థలు అమ్ముతున్నారన్నారు. కనీసం విద్యార్థులకు సరైన సౌకర్యాలు కూడా లేకుండా చైతన్య పాఠశాల నిర్వహణ జరుగుతోందన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హర్ష కుమార్, భగత్, పవన్, మహేష్, జస్వంత్, మణికంఠ, శివ, శ్రీనివాస్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడో ఏదో జరిగింది..?

- ఎన్నికల ఫలితాలపై ఓటర్లలో చర్చ

అమడగూరు : సాధారణ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఫలితాల సరళి ఏకపక్షంగా ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాయి. పారదర్శక పాలనను వేనోళ్లా కొనియాడారు. గతంలో ఎన్నడూ ఇంతటి సుపరిపాలన చూడలేదని జనం చర్చించుకున్నారు. సంక్షేమ పాలన కోసం మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామని అనేకమంది బహిరంగంగా చెప్పారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి ప్రతి హామీని అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి నీరాజనాలు పలికారు. మే 13వ తేదీన ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిల్చుని మరీ ఫ్యాను గుర్తుకు ఓటు వేశారు. అయితే మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీని నిరాశపరిచాయి. తామంతా అంతగా ఇంటిల్లిపాది వెళ్లి ఓటు వేస్తే వైఎస్సార్‌సీపీకి పడకపోవడం షాక్‌కు గురి చేస్తోందని ఓటర్లు పల్లెల్లో చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో సానుకూలత ఉన్నా.. ఫలితాలు ప్రతికూలంగా రావడం అంతుచిక్కడం లేదంటున్నారు.

ఆ ఓట్లు ఎక్కడికెళ్లాయి..?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా గ్రామం తనకంటిపల్లిలో దాదాపు అన్ని కుటుంబాలకూ వివిధ పథకాల ద్వారా లబ్ధి కలిగింది. నాతో పాటు చాలామంది వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు ఓటేశాం. పోలింగ్ ముగిసిన తర్వాత గ్రామస్తులంతా చర్చించుకున్నాం. పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి రుణం తీర్చుకున్నామని చాలామంది అన్నారు. కానీ ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయి. ముమ్మాటికీ కౌంటింగ్‌లోనే ఏదో జరిగింది. దీనిపై పునరాలోచించాలి.
– తనకంటి జయప్ప, జేసీఎస్ కన్వీనర్, అమడగూరు మండలం

ఆరోగ్యానికి అండ

- పీహెచ్‌సీల అభివృద్ధితో ఆరోగ్య ధీమా
- సరికొత్త వసతులతో ప్రభుత్వాస్పత్రులు



రాయదుర్గం: గతంలో పీహెచ్‌సీల్లో అరకొర వైద్యం అందేది. డాక్టర్లు ఉన్నా మందులు ఉండేవి కాదు. వైద్యుల పోస్టులు ఖాళీగా ఉంటే సకాలంలో నియామకం జరిగేది కూడా కాదు. పారాసిటమాల్‌తో పాటు సిరప్‌లు అందుబాటులో ఉంచితే చాలు రోగులు అదృష్టంగా భావించేవారు. లేదంటే నిరాశతో వెనుదిరిగాల్సి వచ్చేది. అయితే 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీహెచ్‌సీల రూపురేఖలను మార్చేసింది. ప్రతి పీహెచ్‌సీకి రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసింది. దీంతోపాటు వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచేలా చేసింది.

ప్రతి ఆస్పత్రిలో 14 మంది సిబ్బంది

పేదలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతకు ముందు అధ్వానంగా మారిన ప్రాథమిక వైద్యశాలలకు 'నాడు–నేడు' ద్వారా కొత్త రూపు తీసుకొచ్చింది. జిల్లాలో 45 ప్రాథమిక, 25 అర్బన్ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటి పరిధిలోని సుమారు 980 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఒక్కో పీహెచ్‌సీలో ఒక్కో విధంగా ఉద్యోగులు ఉండేవారు. దీంతో రోగులకు నామమాత్రంగానే సేవలు అందేవి. ఉన్నవారితోనే సర్దుబాటు చేసి పంపించేవారు. కొన్ని ఆస్పత్రుల్లో అటెండర్లు, స్వీపర్లే కట్లుకట్టి, సూదివేసేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పీహెచ్‌సీలోనూ సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా 143 జీవో అమలు చేశారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ సూపర్‌వైజర్లు ఇద్దరు (పురుష, మహిళ), సీహెచ్‌ఓ లేదా ఎంపీహెచ్‌ఓల్లో ఒకరు, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్ఎన్, ఎఫ్ఎన్ఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఎల్‌జీఎస్) ఇలా 14 మంది ఒక పీహెచ్‌సీలో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఫ్యామిలీ డాక్టర్..

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణులకు మెరుగైన వైద్యం మరింత చేరువైంది. షెడ్యూల్ మేరకు ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. మరో పక్క జగనన్న సురక్ష ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను జల్లెడ పట్టి చికిత్స అందించారు. షుగర్, బీపీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు అందేలా కృషి చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందించారు. దీంతో లక్షలాది మంది పేదలు ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకున్నారు.



కూలిన వందేళ్ల వేపచెట్టు

పావగడ: తాలూకాలోని హుస్సేన్‌పురం గ్రామంలో వందేళ్ల వేప చెట్టు బుధవారం ఉన్నఫళంగా కూలి పోయింది. ఆ చెట్టు పక్కనే ఉన్న ఓ ఇంటిపై కూలిపోవడంతో ఇల్లుపై భాగం దెబ్బతింది. అనంతరం గ్రామస్తులు చెట్టును తొలగించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే వందేళ్లున్న చెట్టు కూలిపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కనువిందు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలో బుధవారం సాయంత్రం ఆకాశం మేఘవృతమైంది. భారతదేశ చిత్రపటం ఆకారంలో నల్లటి మేఘం కనువిందు చేసింది. పలువురు మేఘం కనిపించేలా సెల్‌ఫోన్లతో సెల్ఫీలు దిగుడం కనిపించింది.



వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన లక్ష్మీగణపతిని దేవరాజు అనే వ్యక్తి కట్టెతో దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లక్ష్మీగణపతి మూడేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి కవితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. బుధవారం పీఆర్‌టీ వీధిలో నీళ్ల ట్యాంకు వద్దనున్న లక్ష్మీగణపతిని భార్య అన్న అయిన దేవరాజు కట్టెతో దాడి చేశాడు. దాడిలో గాయాలపాలైన లక్ష్మీగణపతిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు, మునిమడుగు, పంచాయతీ గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. వెంకటరెడ్డిపల్లిలోని 33.11 కేవీ విద్యుత్ లైన్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు శనీశ్వరుడి జయంతి

అమరాపురం: స్థానిక బస్టాండు సమీపంలో వెలసిన శనేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శనీశ్వరస్వామి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈరన్న తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు నరసింహభట్టాచార్యులు తెలిపారు.

కొనసాగుతున్న విత్తన పంపిణీ

చిలమత్తూరు: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ కాయల పంపిణీ బుధవారం కూడా కొనసాగింది. ఏఓ వంశీకృష్ణ మాట్లాడుతూ 466 మంది రైతులకు 255.8 క్వింటాళ్ల వేరుశనగను పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 2,834 మంది రైతులకు 2045.7 క్వింటాళ్ల విత్తనకాయలు పంపిణీ చేశామని చెప్పారు.